# 38. కన్నతల్లికా ఖైదు!

**మా** పక్క వీధి కార్నర్‌లో ఉన్న పరిమళా ఎపార్ట్‌మెంట్స్‌లో తెలుగువాళ్ళు దిగారని తెలియగానే నా ప్రాణం లేచివచ్చింది. ఆ సండేనాడే వెళ్ళి రమేష్‌ని కలుసుకోకుండా ఉండలేకపోయాను.

అతనూ నాలాంటివాడే. నిమిషాలమీద మా స్నేహం పెనవేసుకుపోయి నువ్వు నువ్వనే స్టేజికి చేరుకోడానికి నిండా రెణ్ణెల్లు కూడా పట్టలేదు. అతని భార్య విమల కూడా ఏదో జాబ్ చేస్తోంది. ఏమాత్రం మొహమాటపడకుండా ఎప్పుడెళ్లినా ఎంతో ఆప్యాయంగా పలకరిస్తుంది. రమేష్ నాకంటే ఓ పదిహేనేళ్లు పెద్దవాడు. అయినా ఎప్పుడూ నవ్వుతూ చురుకుగా ఉండడం చేత ఉన్న వయసుకన్నా బాగా చిన్నవాడుగా కనిపిస్తాడు. పెళ్లయి పుష్కరం గడిచినా ఫ్రెష్‌నెస్ తగ్గని ముచ్చటైన దాంపత్యం వాళ్లది. 'ఇప్పట్లో పిల్లలు వద్దనుకున్నారు కాబోలు' అనే నా ఆలోచన సరికాదనే సమాచారం కూడా నాకు అందింది. పన్నెండేళ్ల వాళ్ల బాబీ ఢిల్లీలో కాబోలు ఏదో రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకుంటున్నాట్ట. 'పెద్దదిక్కు అనేది లేకపోవడం ఒక్కటే వాళ్లకున్న లోపం' అనే నా సానుభూతి కూడా అవసరం లేని అదృష్టం వాళ్లది. రమేష్ అమ్మ సుభద్రమ్మగారు వాళ్లతోనే ఉందిట.

"మేమిద్దరం చూడబోతే చీకటితోనే గూడువిడిచి మళ్లీ చీకటి పడ్డాకే గూడు చేరుకునే పక్షుల్లాంటి వాళ్లం. ఇంతటి మహానగరంలో మన భాషగాని ఈ మారుమూల ప్రాంతపు క్వార్టర్సులో పాపం మా అమ్మ రోజు రోజంతా బిక్కు బిక్కుమని గడపాలి. మునుపైతే మా బాబి గాడైనా ఉండేవాడు. ఇన్నాళ్లకి కాస్త భాష తెలిసిన వాడివి దగ్గరికి వచ్చావు. అయితే ఏం లాభం? కిందటేడు వచ్చిన వైరల్ ఫీవర్‌తో ఆవిడ ఓకల్ కార్డ్స్ తెబ్బతిన్నట్టున్నాయి. నువ్వేం మాటాడినా వింటుంది గాని మాట్లాడగలిగే శక్తీ కోల్పోయింది మరి!"

అంటూ తల్లిని ఇంట్రడ్యూస్ చేశాడు రమేష్ స్వరపేటిక దెబ్బతింటే తిందిగాని మనిషి మాత్రం ఆ వయసుకి ఆరోగ్యంగానే కనపడింది నాకు. ఆ మాటే తర్వాత అతన్తో అనబోతే ' పైకి అలా కనపడుతుంది గానీ బాగా ముదిరిన డయబటీసు పేషెంట్ ' అని చెప్పాడు.

ఆ తర్వాతి నుంచి నా మనసు వాళ్లిద్దర్నీ ఒదిలిపెట్టి సుభద్రమ్మగారి చుట్టూ తిరుగుతూ వచ్చేది. దానికతోడు వాళ్లింటి పక్క వాటా సునీల్‌తో పరిచయమైంది నాకు. సుభద్రమ్మ గురించి అతను చెప్పే విషయాలు వింటున్నకొద్దీ ఉన్న మతి పోయినట్టయింది నాకు.

'అయ్యోరామా, ఇన్నాళ్ల నుంచి వస్తూ పోతూ ఉన్నారు. ఆ మాత్రం గ్రహించలేకపోయారా! ఇంత పెద్ద ఎపార్టుమెంటులో ఏ చిన్న పిల్లాణ్ణయినా అడిగి చూడండి. ఆ ముసలావిడ కష్టాలే చెబుతారు. మీ సౌత్ ఇండియన్ ఫామిలీస్ చాలావరకూ ఇలాంటివేటగా!'

నాకు బాగా హిందీ వచ్చునని వాడికి తెలుసు. అంతగా హిందీ అందకపోతే ఆ జాగాలో ఇంగ్లీషు జోడించి ఎలాగో విషయం అందుకునేలా చేస్తాడు. సుభద్రమ్మగారూ చిన్నప్పుడేవో హిందీ

పరీక్షలు కట్టి పాసయిందిట. పైగా ఏదైనా సులువుగా పట్టుకునే తెలివిగల మనిషి. కొడుకు కోడలూ అలా ఆఫీసుకి వెళ్లనిచ్చి ఇలా వచ్చి వీళ్లింట్లో కూచునేదిట. పాపం తన కష్ట సుఖాలు చెప్పుకొనేదిట. గుండెలేని దేవుడు ఆ ఒంటరి దానికి ఆ ఒక్క అవకాశమూ లేకుండా మాట పడిపోయేలా చెయ్యాలా!

వాళ్లిద్దరు నా కళ్లెదుట మెదిలారు. ఎప్పుడూ నలగని బట్టలతో ఉంటారు. చెదరని చిరునవ్వుతో మాటాడుతారు. సౌత్ ఇండియన్స్ అందరికీ అపకీర్తి తెచ్చేటంత దుర్మార్గతని ఎలా దాచుకోగలిగారో! అత్తగారి జవహరీ, చాకిరీ తప్ప విమలకి మరొకటి అక్కర్లేక పోయిందంటే అర్థం చేసుకోవచ్చు. ఆ రమేష్‌కి ఇదేం బుద్ధి? మొగుడు ఏనాడో పోతే ఉన్న ఒక్క కొడుకునీ ఒక్క చేతిమీద పెంచి పాపం ఆ మహా ఇల్లాలు ఇంతటి ఉద్యోగస్థుణ్ణి చేసింది. ఈ ముసలితనంలో కొడుకు తల్లిని చూసుకోవలసిన తీరు ఇదేనా!

'దయలేని దేవుడు ఈ వయసులో ఆవిడ నోటికి వేసిన తాళం సరేసరి, తక్కిన తాళాలమాట? అని సునీల్ చెప్పిన మాట నిజమో కాదో అని ఆ మర్నాడు నేనే పరిశీలించి చూశాను. సుభద్రమ్మ గారికి వేరే ప్రత్యేకించిన గదిలో అలమారకు కూడా తాళం!

వాళ్లిద్దరూ ఉద్యోగాలకి వెళ్లేముందు వీధి గదికి బయట ఎలాగూ తాళం వేస్తారు. కన్నతల్లిని ఖైదుచేసిన కఠినాత్ముణ్ణి క్షమించలేకపోయింది నా మనసు. ఓ శెలవు రోజున అత్తగారిని తీసుకుని విమల దక్షిణేశ్వరం వెళ్లిన అవకాశం పురస్కరించుకుని రమేష్‌ని దులిపి దుళ్లగొట్టేశాను. గుండెలు దీసిన బంటు, వాడెందుకు చెక్కు చెదురుతాడూ, మొహంలో మారుతున్న రంగులు పైకి కనపడనీయకుండా తలవంచుకుని నెమ్మదిగా స్పష్టంగా తన సంజాయిషీ వివరించసాగేడు.

మా తప్పులేదని మాకు స్పష్టంగా తెలిసినా లోకనిందకు తట్టుకోలేక ఒక్కొక్కప్పుడు చికాకుపడుతూ ఉంటాం. ఆ కలిగిన అశాంతి ఒకరిమీద ఒకరం ఆ ఆవేశంలో నెట్టుకుని ఘర్షణపడుతూ ఉంటాం. అది మా పిల్లాడిమీద నీడలా సోకి వాడి మనస్తత్వం కలుషితం కావడం మాకు ఇష్టంలేదు. అందుకే ఎంతో ఆలోచించి మనసు రాయి చేసుకుని ఉన్న ఒకే ఒక కొడుకుని దూరప్రాంతంలో పెట్టేశాం. మాది నిజమైన ప్రేమే అయితే వాడు హెల్దీగా పెరగడమే మా లక్ష్యం అవుతుంది గనక........

మా నాన్నపోయాక అయిదేళ్ళ నన్ను తీసుకుని మా అమ్మ తను పుట్టిల్లు రాజమండ్రి చేరింది. మా అమ్మమ్మ ఎప్పుడో పోయిందిట. మా దొడ్డమ్మ ఉంది గాని వాళ్ల అత్తారి ఊర్లో స్థిరపడిపోయింది. తలచెడి ఇల్లుచేరిన మా అమ్మ ఆ విధంగా చిన్న వయసులోనే ఆ ఇంటికి ఆడదిక్కుగా స్థిరపడింది. క్లుప్తంగా బతికి డబ్బు కూడిక చేసుకోవడం ఎలాగో అదొక్కటే మా తాతగారి నిత్యసాధనా, జీవితాదర్శమూ. అదే ఆ పది పదిహేనేళ్ల పాటూ మా అమ్మకి చెవిలో ఇల్లు కట్టుకుని నూరిపోసినట్టున్నాడు ఆయన. ఇటు తండ్రి ఇచ్చిందీ, అటు మొగుడి దగ్గర్నుంచి వచ్చిందీ తరాల సరిపడే సిరి చేరినా చూసి చూసి పైసా కదపలేని లుబ్ధత్వం మా అమ్మలో స్థిరపడి పెరుగుతూ వచ్చేది అనుకుంటా.

మా మేనమామలు ఇద్దరు పై ఊళ్లలో సర్దుకున్నా ముగ్గురు మాత్రం పొలంమీదే తిరుగుతూ

ఉండేవారు. ఇంటి పెత్తనం లభించిన మా అమ్మకి ఆవిధంగా ముగ్గురు ఆడపడుచుల్ని సాధించే యాజమాన్యం కూడా చేజిక్కింది. పుట్టిల్లు చేరిన విధవరాలికి ధనమూ అధికారమూ లభిస్తే చెప్పేదేముంది, అందరి మీదా అత్తగారి పెత్తనం చేసేది.

'సరే, ఇది పాత కథ. అదివరకే అత్తగారి చెలాయింపుకి అలవాటుపడిన ఆడది సొంత కోడలికి నివాళులిస్తుందా! హాయిగా ఖర్చు పెట్టుకుంటూ స్వేచ్ఛగా పెరిగిన విమల మొదట్లో ఇది తట్టుకోలేక గిలగిలాడిపోయేది. అయినా గడుసుది గనక తన సమస్యని తనే పరిష్కరించుకోగలిగింది. నిశ్శబ్దాన్ని మించిన పదునైన మాటలేదని తెలుసుకుంది. వెంటనే ఉద్యోగంలో చేరింది. చల్లగా తనకు నచ్చే పద్ధతిలో ఇంటిని దిద్దుకుంది. కోడలు చేస్తే అత్తగారికి పనికి రాదు గనక ఆవిడ వంటని ఆవిడే చేసుకుంటుంది. సాయంకాలం వచ్చాక మిగిలింది తీరికగా పూర్తిచేసుకుంటుంది.

'మరి తాళాల మాటో అని అడుగుతావు. చెప్పేనుకదా పుట్టుకతో ట్రెయినింగులో వచ్చిన పీనాసితనం ఆవిడకి పోలేదని, లేదా పోదా టాక్సీలో వెళ్లవే తల్లీ అంటే వినదు. సిటీ బస్సులోనే వెడుతుంది. ఇంత వయసులో ఈ రోగిష్టి మనిషి ఎక్కడ పడిపోతే నేనెలా వెదకను! చెప్పి చెప్పి విసిగెత్తి ఆవిడ మేలుకోరే ఇలా వీధి గదికి తాళాలు వేస్తాను. డయబిటీసు ఎక్కడ పెరిగిపోతుందో అని పంచదార గల ఆ అలమారకీ తాళం వేయక తప్పడం లేదు. నేను ఏ కఠినత్వం చూపినా కన్న తల్లి మీద కనికరంతోనే సుమా!'

★